నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పోచారం: చెట్ల కొమ్మలు తొలగింపు పనులు జరుగుతున్నందున నారపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు చౌదరిగూడ, ఓయూ కాలనీ, వెంకటాద్రి ఫేస్ 1 మరియు 2, లక్ష్మీనగర్, యాదాద్రి నగర్, మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 4 గంటల వరకు స్వర్ణగిరి, డాక్టర్స్, మాన్సాని, వైభవ్, పీజేఎస్, అరుంధతి కాలనీలు, శేషాద్రి ఎన్‌క్లేవ్, చౌదరిగూడ గ్రామం, వెంకటసాయి ఫేస్ 1 మరియు 2, సాయినగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మంత్రులను కలిసిన కాంగ్రెస్ నేతలు



మంత్రి పొన్నంతో కాంగ్రెస్ నేతలు

మేడ్చల్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ నేతలు గురువారం సచివాలయంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లను కలిశారు. పార్లమెంట్ పరిధిలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన నేతలు, గత ఎన్నికలలో పోటీ చేసి ఓడిపోయిన నేతలు అందరూ కలసి వెళ్లి మంత్రులను కలిసి తమ నియోజకవర్గాలలో అభివృద్ధి పై చర్చలు చేశారు. మంత్రులను కలిసిన వారిలో మేడ్చల్ నేత తోటకూర వజ్రేష్‌యాదవ్, ఉప్పల్ నేత పరమేశ్వర్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ నాయకుడు భూపతిరెడ్డి, తదితరులు ఉన్నారు. అన్యాక్రాంతం అవుతున్న దేవాలయ భూములపై మంత్రితో చర్చలు చేసినట్లు తెలిపారు.

అక్రమ నిర్మాణాలను తొలగించండి

మేడ్చల్ రూరల్: మండలంలోని పూడూర్ గ్రామంలోని సాయిబాబా దేవాలయం వద్ద ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలు తొలగించాని గ్రామస్తులు, యువకులు గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపడుతూ మరికొందరు గుడిసెలు వేసుకుని ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని పంచాయతీ అధికారులను కోరారు.

ఉప ముఖ్యమంత్రి దృష్టికి గీత కార్మికుల సమస్యలు



పోచారం: గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి గౌడ సంఘ ప్రతినిధులు గురువారం తీసుకెళ్లినట్లు కౌన్సిలర్ బాలగోని వెంకటేష్ గౌడ్ తెలిపారు. గీత వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి ఆర్థిక ఎదుగుదలకు కృషి చేయాలని భట్టిని ఈ సందర్భంగా కోరారు. అంగవైకల్యం చెందిన వారికి రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అందుకు ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.

'ఇళ్లు లేకున్నా ఇంటి నెంబర్లు కేటాయించారు'

ఘట్‌కేసర్: కాచవానిసింగారంలో అక్రమంగా ఇంటి నెంబర్లు కేటాయించారని ఆరోపిస్తూ మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కర్రె జంగమ్మ డీపీఓకు గురువారం ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్కారు భూమిలో ఇళ్లు నిర్మించకున్నా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఇంటి నెంబర్లు కేటాయిస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. ప్రభుత్వభూమి అని తెలిసిన పేదలకు నోటరీ చేసి పన్నులు చెల్లించినట్లు రశీదులిచ్చి డబ్బులు వసూలు చేశారన్నారు. రశీదు నంబర్ 4754 ద్వారా రూ. 2000 వసూలు చేశారని, ఇదే విధంగా సర్పంచ్ వెంకట్‌రెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి లక్షలు వసూలు చేశారన్నారు. ఈ విషయమై తగు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యదర్శిని వివరణ కోరగా ఇళ్లు లేకుండా ఎవరికీ ఇంటి నెంబర్లు ఇవ్వలేదన్నారు.

మహిళపై దాడి.. 8 మందిపై కేసు నమోదు

మేడ్చల్ రూరల్: పెళ్లి చేసుకుంటానని మొహం చాటేస్తున్న వ్యక్తిపై నిలదీసిన మహిళపై ప్రేమికుడు, అతని కుటుంబీకులు దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకోగా 8 మందిపై మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేశారు.వివరాలు.. అమీర్‌పేట్‌లోని ఓ హాస్టల్‌లో నివాసం ఉంటున్న ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి సుంకరి శ్రావణి (28)భర్తతో విడాకులు తీసుకుని హాస్టల్‌లో ఉంటోంది. అనంతరం మేడ్చల్ మండలంలోని పూడూర్ గ్రామానికి చెందిన కుంట నరేందర్‌రెడ్డితో పరిచయం ఏర్పడగా పెళ్లి చేసుకుంటానని చెప్పిన నరేందర్‌రెడ్డి మోసం చేశాడంటూ బాధిత మహిళ ఇటీవల పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అతనిపై కేసు నమోదైంది. ఈ నెల 16న సాయంత్రం 6.30 గంటల సమయంలో నరేందర్‌రెడ్డి అర్కలగూడ వద్ద ఉన్నట్లు తెలుసుకుని బాధితురాలు అక్కడికి వెళ్లి అతడిని నిలదీసింది. దీంతో నరేందర్‌రెడ్డి, అతని కుటుంబీకులు బాధిత మహిళను గదిలో బంధించి ప్లాస్టిక్ పైపులతో దాడి చేశారు. దీంతో మేడ్చల్ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు పలు సెక్షన్ల కింద 8 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలి

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ గురువారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజకు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ వినతి పత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో మంజూరైన పనులకు కూడా ఎన్నికల కోడ్‌తో టెండర్ కాలేదని జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో గ్రేటర్ బీఆర్‌ఎస్ నేత సాయిజెన్‌శేఖర్ తదితరులు ఉన్నారు.

మేడిపల్లి మేయర్‌కు శ్రీరామ అక్షింతల పంపిణీ

మేడిపల్లి: అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వారి అయోధ్య పూజిత అక్షింతల పంపిణీ కార్యక్రమం మేడిపల్లిలో వేడుకగా కొనసాగుతోంది. బుధవారం వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నాగ రమేష్ నాయుడు, కార్యదర్శి ముక్తేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజిత అక్షింతలను పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఏంపల్లి అనంతరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు బొడిగె రాంధాస్‌గౌడ్, నాయకులు బైటింటి ఈశ్వర్‌రెడ్డి, ఏనుగు మనోరంజన్‌రెడ్డి, సాయిలు, ప్రభు, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్‌లో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. నాగార్జుననగర్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌర్యం కలగకుండా పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

గణతంత్ర వేడుకల సమీక్ష సమావేశంలో కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్‌లో ఈనెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేడుకల్లో జాతీయ భావం ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జాతీయ పతాకావిష్కరణ, పోలీసు గౌరవ వందనం కార్యక్రమాలను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాలని తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం నిర్వహణ విషయాలపై సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు అవసరమైన సూచనలు చేశారు. జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో వేదికను అందంగా అలంకరించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, ముఖ్య అతిథులకు గణతంత్ర దినోత్సవ ఆహ్వానపత్రాలను అందచేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించే కార్యక్రమాలను రెవెన్యూ శాఖ పర్యవేక్షించాలన్నారు. జిల్లా ప్రగతి పై రూపొందించే నివేదిక సీపీవో ఆధ్వర్యంలో తయారు చేయాలన్నారు. జాతీయ భావం ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ అధికారులు చేపట్టాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యశాఖ అధికారులు, సిబ్బందితో పాటు అవసరమైన ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులతో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా సంబంధిత విద్యుత్తు శాఖ అధికారులు ఇప్పటి నుంచే మరమ్మతులు చేసుకోవాలన్నారు. స్వాతంత్ర్య సమర యోధులను ఆహ్వానించి వారికి ఆతిథ్యం అందించాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఆర్డీవోలు రాజేష్ కుమార్, శ్యామ్ ప్రకాశ్, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్, వివిధ శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్కాన్ ఆలయాన్ని శుద్ధి చేసిన బీజేపీ నేతలు



ఇస్కాన్ ఆలయంలో చీపుర్లతో శుభ్రం చేస్తున్న బీజేపీ నేతలు

మేడ్చల్: ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ట సందర్భంగా బీజేపీ నాయకులు చేపట్టిన ఆలయశుద్ధీకరణ లో భాగంగా బీజేపీ నాయకులు మండలంలోని డబీల్‌పూర్ గల ఇస్కాన్ ఆలయాన్ని శుభ్రపరిచారు. గుండ్లపోచంపల్లి లో గల లక్ష్మీనారాయణాలయంలో నాయకులు ఆలయ శుద్ధీకరణ చేశారు. బీజేపీ మధ్య ప్రదేశ్ వ్యవహారాల ఇంచార్జ్ మురళీధర్‌రావు నేతృత్వంలో ఇస్కాన్ ఆలయంను శుభ్రపరిచారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

గుండ్లపోచంపల్లిలో..

గుండ్లపోచంపల్లి లక్ష్మీ నారయణ ఆలయాన్ని జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రంరెడ్డి ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ హంసకృష్ణగౌడ్, సరస్వతి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సెల్ టవర్ పనులు ఆపించాలి

ఘట్‌కేసర్: ఎన్‌ఎఫ్‌సీనగర్ కాలనీలో మాక్స్ యాంజిల్స్ స్కూల్ భవనంపై నిర్మిస్తున్న సెల్ టవర్ పనులు ఆపించాలని కోరుతూ మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు స్థానికులు గురువారం వినతి అందజేశారు. సెల్ టవర్ నిర్మిస్తున్న ప్రాంతంలో కేంద్రీయ విద్యాలయ స్కూల్, టవర్ నిర్మిస్తున్న భవనంలో కూడ ప్రైవేటు స్కూల్ నడిపిస్తున్నారని వినతిలో తెలిపారు. సెల్ టవర్‌తో పిల్లలకు రేడియేషన్ ద్వారా ఆరోగ్యం చెడపోయే ప్రమాదముందని తెలిపారు. మున్సిపల్ అధికారులు అనుమతి లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ నడిపిస్తున్నారన్నారు. మల్లేశ్‌యాదవ్, రవి, లోకేశ్ తదితరులు ఉన్నారు.

నాగరంలో ఎన్టీఆర్ వర్ధంతి



కీసర: నాగారం మున్సిపాలిటీలో ఎన్టీఆర్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌ను సన్మానించిన ఉపాధ్యాయులు



మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ ఉత్తమ అవార్డు లభించడంతో మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ రాములులను ఉపాధ్యాయులు సన్మానించారు. గుండ్లపోచంపల్లి కి చెందిన జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు మున్సిపల్ కార్యాలయంలో శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, బాలరాజు, ఉపాధ్యాయులు ప్రేంకుమార్, రంగాచారి, తదితరులు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం



ఉమేశ్

ఘట్‌కేసర్: ఇంటి నుండి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన మేరకు.. ఘట్‌కేసర్ పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన మచ్చ ఉమేశ్ (26) బుధవారం రాత్రి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ఇంటి నుండి బయటకు వెళ్లిపోయాడు. తెలిసిన అన్ని ప్రాంతాల్లో వెతికినా ఆచూకి లభించకపోవడంతో అతడి భార్య పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

ఉత్తమ సేవలందించిన వారికి ప్రోత్సాహకాలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: ఉత్తమ సేవలందించిన పారిశుద్ధ్య కార్మికులకు ప్రోత్సాహకాలు అందజేస్తామని చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కమిషనర్ సాబేర్ అలీతో కలిసి గురువారం పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో పట్టణాన్ని శుభ్రం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్, మున్సిపల్ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు సీసీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన

కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్‌లో సుమారు రూ.2 కోట్ల అంచనాతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభిస్తారని కార్పొరేటర్ ప్రభుదాస్ గురువారం తెలిపారు. తిరుమలనగర్ అమ్మవారి ఆలయ కమాన్, హెచ్‌బీకాలనీ ఫస్ట్ ఫేస్ గ్రౌండ్ పక్కన రోడ్డు, మంగాపురం వెంకటేశ్వరస్వామి ఆలయం రోడ్లను ఆయన ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు మొదలయ్యే ఈ కార్యక్రమంలో ఆయా కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్‌ఎస్ శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దాబాగార్డెన్ కాలనీవాసులు

కాప్రా: దాబా గార్డెన్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానిక కాలనీవాసులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యేను కలిసిన దాబా గార్డెన్ వాసులు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా తమ కాలనీలో డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. గత ఎమ్మెల్యేకు కూడా ఎన్నోసార్లు వినతి పత్రాలు అందించామని, ఎంత మంది అధికారులను కలిసినా సమస్యకు మాత్రం పరిష్కారం లభించలేదన్నారు. ఇప్పటికైనా తమ కాలనీలో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

22న సీతా రామాంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరిలోని పురాతన సీతా రామాంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 22న అయోధ్య శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని దేవాలయ కమిటీ తెలిపింది. 21వ తేదీ సాయంత్రం శ్రీరామ ప్రవచనాలు, సోమవారం 22వ తేదీ ఉదయం 9 గంటలకు సామూహిక రామాయణ పారాయణం, శ్రీరామ పట్టాభిషేకం, శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ వేడుకల వీక్షణ(ఆన్‌లైన్), మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5.30 గంటలకు శ్రీరాముల వారి శోభాయాత్ర ఆనంద్‌బాగ్ వరకు జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఐటీని ఉప్పల్ ప్రాంతానికి విస్తరించాలి



కాప్రా: ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డివిజన్‌లో వందల ఎకరాల భూమి నిరుపయోగంగా ఉందని, ఈ భూముల్లో ప్రభుత్వం ఐటీ కంపెనీలను విస్తరిస్తే పరిసర ప్రాంతంలోని వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం ఈసీఐఎల్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లాపూర్ డివిజన్ అశోక్‌నగర్‌లో హిందుస్థాన్ కేబుల్స్ లిమిటెడ్ పరిశ్రమ ఎన్నో ఏళ్లుగా మూతపడి ఉందని.. 327 ఎకరాల ఈ స్థలంలో సాఫ్ట్‌వేర్ కంపెనీలను ఏర్పాటు చేస్తే ఇక్కడి ప్రాంతవాసులకే కాకుండా పరిసర సుదూర ప్రాంత యువతకు కూడా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ అంశంపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి యువత, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించి, ఉప్పల్ ప్రాంతాన్ని ఐటీ కారిడార్‌గా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ధర్మేంద్ర, సత్యప్రసాద్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలు

మౌలాలి: మౌలాలిలోని సికింద్రాబాద్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపల్ కవిత ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో అన్ని కేటగిరీల వారికి 80, 6, 7, 8 తరగతిలో కేవలం మైనార్టీ వర్గాల విద్యార్థులకు ప్రవేశాలు ఉన్నాయని, అదేవిధంగా బాలికల కళాశాల ఇంటర్మీడియట్‌లో సీఈసీ, ఎంఈసీలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్: 79950 57903.

ఆడుకుంటున్న చిన్నారిపై కుక్క దాడి

రామంతాపూర్: స్కూల్ నుంచి వచ్చి వీధిలో ఆడుకుంటున్న చిన్నారిపై కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన రామంతాపూర్ రాంరెడ్డినగర్‌లో గురువారం చోటు చేసుకుంది. రాంరెడ్డినగర్‌లో నివసించే సంతోష్ సంధ్య కూతురు కృత్తిక(4) గురువారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్క దాడి చేసి చిన్నారి మొహం, చెవి దగ్గర పలుచోట్ల కాట్లు వేసి తీవ్రంగా గాయపరిచింది. కుక్క దాడిలో చిన్నారి చెవి సగం తెగిపోయి వేలాడింది. చిన్నారిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

కీసర రామాలయంలో 22న ప్రత్యేక పూజలు



సమావేశంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

కీసర: అయోధ్యలో ఈ నెల 22వ తేదీన శ్రీరాముడి విగ్రహ పతిష్ఠ జరగనున్న సందర్భాన్ని పురస్కరించుకొని అదేరోజు కీసరలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తీర్మానించింది. గురువారం జరిగిన ఆలయ కమిటీ సమావేశంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. 22వ తేదీన ఉదయం స్వామి వారికి అభిషేకాలు, విశేష పూజలు, మహా మండపంలో అర్చనలు, భజనలు, కీర్తనలు, భక్తులకు ప్రసాద వితరణ ఉంటాయన్నారు. అయోధ్యలో కొనసాగే కార్యక్రమాలను ఎల్‌ఈడీ తెర్లపై ప్రత్యక్ష ప్రసారాలను భక్తులు తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ పేర్కొంది.

ఆలయంలో శ్రమదానం



శివాలయం ఆవరణను శుభ్రం చేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: అయోధ్యలో శ్రీ రామ జన్మభూమి ట్రస్టు ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకొని అవుషాపూర్ శివాలయంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి గురువారం శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయం ఆవరణ, పరసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇళ్లను మామిడి తోరణాలతో అలంకరించాలని, ఈ నెల 22న సాయంకాలం 5 దీపాలు వెలిగించాలన్నారు. ఆలయ పూజారి సాకేత్, నాయకులు మశ్చేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సాయిలు, వెంకటేశ్, మహేశ్, రవి, సంతోశ్ పాల్గొన్నారు.

పీర్జాదిగూడ ఆలయాల్లో స్వచ్ఛ అభియాన్



సాయిబాబా ఆలయంలో స్వచ్ఛ తీర్థ మహా అభియాన్‌లో కమిషనర్ నమ్యానాయక్

మేడిపల్లి: స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా స్వచ్ఛ తీర్థ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా మతపరమైన ఆధ్యాత్మిక కేంద్రాలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు గురువారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయిబాబా గుడి, హనుమాన్ ఆలయంలో కమిషనర్ ఇస్లావత్ నమ్యానాయక్ ఆధ్వర్యంలో చెత్తను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ పీర్జాదిగూడ నిర్మాణం, నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడం అందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఈ భిక్షపతి, ఇంజినీర్ మురళి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ బోడుప్పల్ లక్ష్యంగా పనిచేద్దాం..



శానిటేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో 7వ డివిజన్‌లో సిబ్బంది నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను గురువారం కమిషనర్ జీ.వేణుగోపాల్ రెడ్డి పరిశీలించారు. ఇందులో భాగంగా చెత్త ఉండే ప్రదేశాలను ఆయన పరిశీలించి వెంటనే తీసివేయాలని ఆదేశించారు. రోడ్లు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. చెత్తను రోడ్డు పక్కన కాల్చవద్దని, చెత్తను సేకరించే రిక్షాలు ఇంటింటికీ వచ్చేవిధంగా పర్యవేక్షణ చేయాలన్నారు. స్వచ్ఛ బోడుప్పల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది కలిసి కట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరాలి



మేడిపల్లి: ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి ఒక్కరికీ అందించాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్పయాత్రను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి తెలిపారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సెట్విన్ సెంటర్‌లో స్వయం సహాయక సంఘాలు, ఆర్‌పిలకు గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కమిషనర్ నమ్యానాయక్ పాల్గొని పోస్టర్, కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లీడ్ డిస్టిక్ మేనేజర్ ఐ.శ్రీనివాసులు, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ అనిల్ కుమార్, సెట్విన్ ఇన్‌చార్జి వనజ, బ్యాంక్ మేనేజర్లు ఉమామహేశ్వర్ రావు, సోమరాజు, స్వయం సహాయక సంఘాలు, ఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ ఈవోలను బదిలీ చేయాలి



ఉప్పల్: కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి గురువారం మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న దేవాదాయ శాఖ ఈవోలను బదిలీ చేయాలని మంత్రిని కోరినట్లు పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. త్వరలో దేవాదాయ కమిటీలను రద్దు చేస్తామని, ఏళ్ల తరబడి పాతుకుపోయిన అధికారులను సైతం బదిలీ చేయనున్నట్లు మంత్రి తెలిపారన్నారు. కాంగ్రెస్ పార్టీలో నిరంతరం పని చేసిన కార్యకర్తల సేవలను పార్టీ మరిచిపోదన్నారు.

మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలి



బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

కుషాయిగూడ: చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న బాధితులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం అధికారులు మార్కింగ్ చేసిన రోడ్డును పరిశీలించి గురువారం ఆయన బాధితులతో మాట్లాడారు. మార్కింగ్ చేసి వెళ్లిన అధికారులు పరిహారం చెల్లింపుపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారన్నారు. టీడీఆర్ పత్రం అందజేసి అధికారులు చేతులు దులుపుకుందామని చూస్తున్నారని ఆరోపించారు. టీడీఆర్‌తో వారికి ఎలాంటి ఫలితం ఉండదని, మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించి ఆదుకోవాలని సూచించారు. రోడ్డు వెడల్పు విషయాన్ని రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. పరిహారం విషయంలోను జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు నాదం, నాగమణి, రాంబాబుతో పాటు బాధితులు శ్రీమన్నరాయణ, జాన్, మురళీధర్, శాస్త్రి, ఫణిస్వామి, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, విజయసింహారెడ్డి, నీరజ, ఉమ, శారత, సరిత, రేణుక తదితరులు పాల్గొన్నారు.